వృద్ధులకు 'ఆయుష్మాన్ భవ' వరం

70 ఏళ్లకు రూ. 5 లక్షల ఆరోగ్య బీమా ● మేడ్చల్ జిల్లాలో లక్షకుపైగా లబ్ధిదారులు

రామంతాపూర్: వృద్ధాప్యంలో సీనియర్ సిటిజన్స్‌కు అన్ని రకాల వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రుల పాలైన వైద్య ఖర్చులు భరించలేక వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ప్రైవేట్ ఆరోగ్యబీమా కార్డులు జారీ చేసే సంస్థలు ఏడాదికి వృద్ధులకు అధిక ప్రీమియం వసూలు చేస్తున్నాయి. దీంతో ఈ విషయాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం గత నెలలో 70 ఏళ్ల సీనియర్ సిటిజన్‌కు ప్రత్యేక ఆరోగ్య పథకాన్ని ప్రారంభించింది.



వృద్ధులందరికీ వైద్యం..

ఈ పథకం ద్వారా తక్కువ ఆదాయం కలిగిన వారందరికి ఉచిత వైద్యం లభిస్తుంది. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు దాటిన వృద్ధులకు 'పీఎం జనారోగ్య ఆయుష్మాన్ భవ' పథకంలో కేవలం వయస్సును నిర్ధారించే ఆధార్ కార్డుతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి జనారోగ్య యోజన ఆయుష్మాన్ భవ పథకంలో చేరవచ్చు.

◆ మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లాలో దాదాపు లక్ష మంది 70 ఏళ్లు దాటిన వృద్ధులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉందని సమాచారం.

ఉపయోగాలు..

70 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లు ఈ పథకంలో చేరిన రోజునే ఉచిత వైద్య సేవలు పొందవచ్చు. ఈ పథకంలో దేశ వ్యాప్తంగా 30 వేల ఆసుపత్రులు ఎం ప్యానెల్ అయినట్టు అందులో 15 వేల ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం. ఈ పథకంలో 1.835 వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్సలు పొందవచ్చు.

దరఖాస్తు చేసుకునే విధానం..

ఏబీ పీఎం జేఏవై పథకంలో చేరి లబ్ధిపొందడానికి ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎం జేఏవై పోర్టల్‌లో లాగిన్ అయి 70 ప్లస్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. దీంతో బెనిఫిషయరీ ఎన్‌హెచ్‌ఏ జీవోవీ ఐ.ఎన్. వెబ్‌సైట్‌కి కనెక్ట్ అవుతారు. అక్కడ 'క్యాప్చ', మొబైల్ నెంబర్ ఓటీపీలు నమోదు చేయాలి. కేవైసీ కోసం వివరాలు నమోదు చేసిన అనంతరం హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలో ఉన్న ఇంటర్నెట్ కేంద్రాల్లో 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ప్రత్యేక హెల్త్‌కార్డు కోసం నమోదు చేసుకుని కార్డు పొందవచ్చు.

ప్రజావాణిలో అధికారులు లేకుంటే ఎలా ?



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సంబంధిత విభాగాల అధికారులు లేకుంటే ఎలా అని కార్పొరేటర్ శ్రవణ్ డీసీ రాజును ప్రశ్నించారు. సోమవారం ప్రజావాణికి హాజరైన ఆయన శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు లేకపోవడంపై డీసీని ప్రశ్నించారు. కార్యక్రమంపై శ్రద్ధ లేకుంటే ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తారని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపటికి శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చినప్పటికీ ఇంజినీరింగ్ విభాగం డీఈ మహేష్ డీసీ ఫోన్‌చేసినా రాలేదన్నారు. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం హైడ్రాను ఉపయోగిస్తుంటే ఓ వైపు ఆ విభాగం చైన్‌మెన్లు, అధికారులు అక్రమ నిర్మాణదారులకు వంతపాడుతున్నారన్నారు. దీనివల్ల నాలాలే కాకుండా ప్రభుత్వ స్థలాలు కూడా కబ్జాకు గురవుతున్నాయన్నారు. ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నాయని, రంబుల్ స్ట్రిప్స్ వేయమని సూచించినా వేయడం లేదన్నారు.

నిధులు మంజూరు చేయండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్‌లోని పెండింగ్‌లో ఉన్న రోడ్లు, కమ్యూనిటీహాల్‌కు వెంటనే నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ. డివిజన్ సూర్యనగర్‌లోని రోడ్లు, కమ్యూనిటీహాల్స్ తదితర అంశాలపై జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని ఆయన స్పందించి త్వరగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

సీఎంను కలిసిన మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి



కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కుమార్తె కష్యపిరెడ్డితో కలిసి సీఎం ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. డివిజన్ నాయకులు వంజరి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలి



బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డి

అల్వాల్: ఖాతాదారులకు మంచి సేవలు అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓల్డ్ అల్వాల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన కాకతీయ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించి రోజురోజుకు అభివృద్ధి చెందుతూ మరిన్ని శాఖలు విస్తరించాలన్నారు. అనంతరం బ్యాంకు చైర్మన్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. వినియోగదారులకు ప్రభుత్వం, కార్పొరేట్ బ్యాంకులకు మించిన తరహాలో సేవలు అందిస్తామన్నారు. అల్వాల్ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజీఎం రాజగోపాల్, సీఈఓ ఆర్.సంజీవరెడ్డి, బిల్డింగ్ ఓనల్ సురేందర్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ షాపింగ్ కాంప్లెక్స్‌ను కాపాడండి



వినతిపత్రంతో గగన్‌కుమార్

కాప్రా: జమ్మిగడ్డలో జీహెచ్‌ఎంసీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను కాపాడాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ కోరారు. సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపింగ్ కాంప్లెక్స్‌లోని 10 కమర్షియల్ షటర్స్ విషయంపై ఏళ్ల తరబడి అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఫిబ్రవరి 16న చేసిన ఫిర్యాదుతో స్పందించిన ఉన్నతాధికారులు జమ్మిగడ్డ షాపింగ్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎంసీకి చెందినదేనని గుర్తించారన్నారు. గతంలో టాక్స్ అసెస్మెంట్ చేసిన నాటి కాప్రా జీహెచ్‌ఎంసీ రెవెన్యూ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. అనంతరం షాపింగ్ కాంప్లెక్స్‌లోని షటర్లు స్వాధీనం చేసుకుని యాక్షన్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి జమ్మిగడ్డ షాపింగ్ కాంప్లెక్స్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి: ఓల్డ్ నేరెడ్‌మెట్‌లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వనాథ్ ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ ధర్మంలో కార్తీకమాసానికి చాలా ముఖ్య ప్రాముఖ్యత ఉందన్నారు. పరమేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నానన్నారు. దేవాలయం నిర్మించి 100 ఏళ్లు పూర్తైనందున రాజగోపురానికి ముఖ ద్వారం చేయిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు సమాచారం.





ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న అర్చకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం సైనిక్‌పురి సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు గాంధీనగర్, శ్రీనివాస్‌నగర్, అరుణ్‌కాలనీ, ఆదిత్యనగర్, లక్ష్మిఅవెన్యూ, బాలాజీ ఎన్‌క్లేవ్, శ్రీరాంనగర్‌కాలనీ, రాందాస్‌నగర్‌లో సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో నర్సింహానగర్ ఫీడర్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మల్లాపూర్ ఏఈ నాగరాజు తెలిపారు.

◆ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సాయిబాబా దేవాలయం, 11 కేవీ శాంతి గార్డెన్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాను ఉండదని ఏఈ తెలిపారు.

మల్కాజిగిరి: వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ దేవీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కృపాకాంప్లెక్స్, శ్రీకృష్ణనగర్, సీతారాంనగర్, సైనిక్‌నగర్, రాంబ్రహ్మనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ క్రిస్టినా తెలిపారు.

ఉప్పల్: హబ్సిగూడ 11 కేవీ రవీంద్రనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జేఎస్‌ఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

◆ చిలుకానగర్ పరిధి 11 కేవీ సూర్యహిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు మంగళవారం నార్త్ బాలాజీహిల్స్, రాజశేఖర్ కాలనీ, హేమానగర్, న్యూ హేమానగర్, సూర్యహిల్స్, ఈదయ్యనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు.

◆ ఉప్పల్ భగాయత్ పరిధి విజయపురి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విజయపురికాలనీ సహా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు.

అభినందన



శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కల్వ సుజాతను సోమవారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆమెను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ లక్ష్మణ్‌కు సూచించారు. సోమవారం రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ ఎత్తును పెంచి నిర్మాణం చేపట్టాలన్నారు. వినాయకనగర్ చైనాబజార్ వద్ద నాలా పూడిక తొలగించి దెబ్బతిన్న నాలాను పునర్నించాలని సూచించారు. ఏఈ నవీన్, వీఐ రమేష్, ప్రదీప్, నాని, రవి పాల్గొన్నారు.

పరామర్శ



బోడుప్పల్: ఓ ప్రైవేట్ కార్యక్రమానికి బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి వెళ్లారు. కాగా ఆకృతి టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి అధిక బరువు కారణంగా లిఫ్ట్ వైర్ తెగిపోయింది. ఈ ఘటనలో కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, కాంగ్రెస్ నేతలు జంగారెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. సోమవారం వారిని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి పరామర్శించారు. లిఫ్ట్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు



బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 12వ డివిజన్ కార్పొరేటర్ కల్యాణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాజీవ్‌నగర్ కాలనీ ఫేస్ – 2లో ఆయన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

'ది ఆర్గానిక్ వరల్డ్ స్టోర్' ప్రారంభం

అల్వాల్: అల్వాల్ హైటెన్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన 'ది ఆర్గానిక్ వరల్డ్ స్టోర్'ను సోమవారం బీఆర్‌ఎస్ నేత వంశీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రమేష్, శేఖర్‌గౌడ్, సతీష్, శ్రీధర్‌రావు, ఉదయ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని అండాల్‌నగర్‌లో రూ.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు, మహాత్మ గాంధీనగర్ శ్మశానవాటికలో రూ.17 లక్షలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధిలో అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేస్తే ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. కాంట్రాక్టర్లు కూడా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. బీఆర్‌ఎస్ నేతలు వంశీముదిరాజ్, అమీరుద్దీన్, భాగ్యనందరావు, సంతోష్‌నాయుడు, సాధిక్, ఆదినారాయణ, జోగు శ్రీనివాస్ తదితరులున్నారు.

రాజస్థానీ, మార్వాడి నూతన కమిటీ



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో స్థిరపడ్డ రాజస్థానీలకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ, మౌలాలి రాజస్థాని, మార్వాడి సంఘం నూతన కమిటీ సమావేశంలో కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన కైలాష్‌శర్మను అభినందించి సత్కరించారు. అనంతరం కైలాష్‌శర్మ మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో మూడోసారి అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్‌ఎస్ నేతలు జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, సంఘం ఉపాధ్యక్షుడు సోహన్‌లాల్ సిర్వి, మనోజ్‌శర్మ, కోశాధికారి కిషోర్‌శర్మ, కార్యదర్శులు దగ్లారాం, జాయింట్ సెక్రటరీ నరేందర్ సాంక్ల, ప్రభారి, చేతన్‌శర్మ, బాబులాల్, దుర్గారావుపవార్ తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మేకల సునీతాయాదవ్

గౌతంనగర్: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. సోమవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మధుసూదననగర్‌లోని సెయింట్ మార్టిన్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి క్రీడారంగంలో రాణించాలన్నారు. పాఠశాల నిర్వాహకులు లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, జైక్రిష్ణయాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాహరికిషన్, నేతలు మేకల రాముయాదవ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.6 వేల పెన్షన్ అమలు చేయాలని సోమవారం జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెట్రోలో కూడా దివ్యాంగుల పాస్‌లు అనుమతించాలని కోరారు. కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, వికలాంగుల సమాఖ్య ప్రతినిధులు బాబు, జానీ, అంజి, లక్ష్మి, చంద్రశేఖర్, పాండునాయక్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 6వ డివిజన్‌లో మంగళవారం చేపట్టిన కులగణన కార్యక్రమంలో ఆయన కమిషనర్ రామలింగంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సర్వే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే అని, ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారంతో ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడటంతో పాటు అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పకడ్బందీగా కులగణనను చేపట్టాలని, ప్రజలు కూడా అందుబాటులో ఉన్న సమాచారాన్ని వారికి అందించాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గౌతంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మల్కాజిగిరి బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మిర్జాల్‌గూడ, రామాంజనేయనగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచనల మేరకు గౌతంనగర్ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్ కుమార్, నాయకులు ఫరీద్, పీపీ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌కు చెందిన చలపతికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నేతలు అనిల్‌కిషోర్‌గౌడ్, సంపత్, జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'విలన్ సంఘ్' ఉత్సవాలు



అల్వాల్: అల్వాల్ సర్కిల్ లోతుకుంట శుభశ్రీ గార్డెన్‌లో బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగధాత్రి, జగదాంబ విలన్‌సంఘ్ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బాబి మాట్లాడుతూ.. గత 20 ఏళ్లగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, నగరంలోని పలు ప్రాంతాల నుంచి బెంగాలీ ప్రాంతవాసులు ఈ ఉత్సవాల్లో కుటుంబసమేతంగా పాల్గొంటున్నారన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు, బెంగాలీ ప్రాంతవాసులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



మల్లాపూర్: పెండింగ్ పనులు సత్వరమే ప్రారంభమయ్యేలా చూడాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తిలను కోరారు. నాచారం డివిజన్‌కు డీఈ, ఏఈలుగా నియమితులైన సందర్భంగా కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాచారం డివిజన్‌లో పలు పెండింగ్ పనులపై చర్చించారు. వంతెన నిర్మాణ పనులు, సరస్వతినగర్ కాలనీలో పార్క్ అభివృద్ధి, రైతుబజార్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం, ఎర్రకుంటలోని హిందూ శ్మశానవాటికల్లో పనులు, రోడ్ల విషయంపై కూలకషంగా చర్చించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు

కుషాయిగూడ/కాప్రా: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని సీపీఎం పార్టీ కాప్రా సర్కిల్ కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. సర్కిల్ పరిధిలో వీధిదీపాలు వెలగక అంధకారం నెలకొందని, వెంటనే స్పందించి వీధిదీపాలను ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను పట్టించుకుని పరిష్కరించాలని కోరారు. సీపీఎం నాయకులు సీహెచ్. ప్రసాద్, దుర్గయ్య, జెన్ని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అల్వాల్: క్రీడా దినోత్సవం సందర్భంగా పల్లవి మోడ్ స్కూల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల విన్యాసాలు కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శిల్పవల్లి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. పవర్ లిటిల్ పార్వతి, ఫుట్‌బాల్ లీగ్ చైర్మన్ ఫల్గుణ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ అధినేత విజనరీ, చైర్మన్ మల్కా కొమురయ్య పాల్గొన్నారు.

ముగిసిన బాడీ బిల్డింగ్ పోటీలు



అల్వాల్: తెలంగాణ 38వ మిస్టర్ అండ్ మిసెస్ ఇండియా - 2024 బాడీ బిల్డింగ్ పోటీల్లో అమర్దీప్ రాయ్ చాంపియన్‌గా నిలిచారు. అల్వాల్‌లోని ఎమ్మార్ కృష్ణ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి జరిగిన బాడీ బిల్డింగ్ పోటీలలో పలు రాష్ట్రాల నుండి బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. పురుషుల ఫిజిక్ విభాగంలో తెలంగాణకు చెందిన తాహాఖాన్ చాంపియన్‌గా నిలవగా, మహిళా విభాగంలో అశ్విని టైటిల్ గెలుచుకుంది. దివ్యాంగుల విభాగంలో తమిళనాడుకు చెందిన ఎస్. శివ టైటిల్ గెలుచుకున్నాడు. టీమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గెలుపొందగా.. రెండో స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ దక్కించుకుంది. బెన్నీ ఫ్రాన్సిస్, గురునాథన్, సలీం, నవీన్‌రాజ్, జార్జ్ ఫ్రాన్సిస్, సుకన్యబాయ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమం



ఓంకార్ (ఫైల్)

ఉప్పల్: రామంతాపూర్ ప్రగతినగర్‌లో ఓ హోటల్ గదిలో ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బోరబండ ప్రాంతానికి చెందిన ఓంకార్ (29) ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగి. కాగా ఉప్పల్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న యువతి (22) ఇద్దరు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆదివారం రాత్రి రామంతాపూర్ ప్రగతినగర్‌లోని టౌన్ హౌజ్ హోటల్‌లో గదిని బుక్ చేసుకున్నారు. గదిలో ఇద్దరు కలిసి మద్యం సేవించారు. తెల్లవారు జామున వీరద్దరి మధ్య మాటా మాటా పెరిగి, అనంతరం ఆవేశానికి గురైన ఓంకార్ హోటల్ గదిలోనే చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్రమత్తమైన సదరు యువతి హోటల్ నిర్వాహకులను పిలిచి వారి సాయంతో అతడిని కిందకు దింపి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సదరు వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.